క్లుప్తంగా

నక్షత్ర నాయికిగా అమ్మవారి దర్శనం



రాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

బొండపల్లి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం నక్షత్ర నాయికిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని సీఎస్‌డీటీ ఎస్.వి.వి.ఎస్.మూర్తి తెలిపారు.ఎస్.కోట సచివాలయం-2లోని ప్రత్యేక ఆధార్ కేంద్రంలో ఆధార్ సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా ఆధార్ ఒక్క సారి కూడా అప్‌డేట్ చేయని వారు కచ్చితంగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేషన్ కోసం ఎన్‌రోల్‌మెంట్ ఫారం ఇస్తే చాలని, మైఆధార్ అప్లికేషన్ ద్వారా మొబైల్‌లో లేదా ఆధార్ నమోదు కేంద్రాల్లో చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం మండలంలో మూలబొడ్డవర, ఎస్.కోట-2 సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

చీపురుపల్లి: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడిందని, విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఒక ప్రణాళికతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు చెప్పారు. స్థానిక బాలికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ సమయం వృథా చేయకుండా చదువుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ ఉన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

బొండపల్లి: ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షాలకు మండలంలోని ముద్దూరులో నేల కొరిగిన మొక్కజొన్నపంటను ఏఓ పి.వి.మల్లికార్జునరావు మంగళవారం పరిశీలించారు. వీఆర్‌ఓలతో పాటు సచివాలయ వీఏఏలతో కమిటీలను నియమించామని, వీరంతా ఈ-క్రాప్‌లో పంట నమోదయ్యి, ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతు పంటనూ పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి నివేదికలు తయారు చేస్తారని తెలిపారు. వీఆర్‌ఓ ప్రభాకరరావు, ఏఈఓ సంతోష్ కుమార్, సర్పంచ్ మునకాల పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్ల మండలంలో..

గుర్ల: గూడెం, పాలవలసలో ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంటను ఏఓ ఎం.తిరుపతిరావు మంగళవారం పరిశీలించారు. మండలంలో సుమారుగా 650 ఎకరాల్లో పంట నేలకొరిగినట్లు గుర్తించామని తెలిపారు.

సర్వేపై రైతులతో ఆర్డీఓ సమావేశం



రైతుల భూహక్కు పత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస: చిన్నిపాలెం గ్రామంలో భూరీసర్వేకు సంబంధించి రైతులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికై విజయనగరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తాముసాగు చేసుకుంటున్న భూములు జీఎంఆర్ సంస్థ పేరిట రెవెన్యూ రికార్డుల్లో అధికారులు నమోదు చేశారని ఆరోపించారు. ఆర్డీఓ స్పందిస్తూ ప్రస్తుతం సాగులో ఉన్న రైతులు తమ హక్కు పత్రాలను సర్వే అధికారులకు చూపాలని, అప్పుడే ఆ భూములు రైతులవిగా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. జీఎంఆర్ సంస్థకు చెందిన హక్కు పత్రాలను, రైతుల హక్కు పత్రాలను సరిచూసి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. దీంతో రైతులు రీసర్వే పనులకు సమ్మతి తెలిపారు. బుధవారం నుంచి గ్రామంలో రీసర్వే ప్రారంభించాలని రెవెన్యూ అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. రీసర్వే ప్రత్యేక డీటీ అప్పారావు,ఆర్ఐ కిశోర్, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపడదాం

చీపురుపల్లి: వర్షపు నీటిని ఒడిసిపట్టడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆశయ యూత్ అసోసియేషన్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'క్యాచ్ ద రెయిన్' అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రాంతాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ దేశంలో చాలా ప్రాంతాల్లో తాగునీటి కోసం మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వర్షపు నీటిని వృథాగా వదిలేస్తుండడం ద్వారా ఎన్నో అవస్థలు ఎదుర్కొనాల్సి వస్తోందని, అందుకే భారత ప్రభుత్వం క్యాచ్ ద రెయిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, అధ్యాపకుడు డి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యానికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, వారికి ప్రభుత్వం మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం విద్యార్థులకు రోజుకో మెనూతో నాణ్య మైన భోజనం అందిస్తుండగా..తాజాగా ఆ పథకంలో రాగి జావను చేర్చింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. విద్యార్థులకు వారానికి మూడురోజులు ఉదయం పూట రాగి జావను అందించనున్నారు. రాగిజావలో ఐరన్, కాల్షియం వంటి పోషకాలు ఉంటాయని, దీన్ని ఆహారంగా తీసుకుంటే విద్యార్థుల్లో రక్తహీనత సమస్య తలెత్తదని అధికారులు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తవలస: కొత్తవలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



శృంగవరపుకోట: బొడ్డవరలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



లక్కవరపుకోట: ఎల్.కోట హైస్కూల్‌లో విద్యార్థులకు రాగి మాల్ట్ అందజేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



చీపురుపల్లి: బాలుర ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష



బొండపల్లి: పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ చలంనాయుడు,జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



జామి: జామి ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎంపీపీ సబ్బవరపు అరుణ



బొండపల్లి: గొట్లాంలో రాగిజావ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సరోజిని,పీఏసీఎస్ చైర్మన్ రమణ



గజపతినగరం: ఏఎస్‌ఎన్‌ఎం స్కూల్‌లో రాగిజావ పంపిణీ చేస్తున్న సర్పంచ్ కొండమ్మ



వేపాడ: ఆదర్శపాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు



చీపురుపల్లిరూరల్ (గరివిడి): కొండపాలేం పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్నమేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రమీల



గంట్యాడ: రామవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎంపీపీ హైమావతి



చీపురుపల్లిరూరల్(గరివిడి): కుమరాం పాఠశాలలో రాగిజావ పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి



గుర్ల: నడుపూరులో రాగిజావ అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు



గుర్ల: పాలవలసలో విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల, సన్యాసినాయుడు



దత్తిరాజేరు: పెదమానాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి



గజపతినగరం రూరల్: మరుపల్లి ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న జెడ్పీటీసీ తవుడు



మెరకముడిదాం: గోపన్నవలస ఉన్నత పాఠశాలలో విద్యార్థికి రాగి జావ వడ్డిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రమణ రాజు, తదితరులు

రైతుల ప్రయోజనాలకే భూరీసర్వే

గుర్ల: రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకే ప్రభుత్వం సమగ్ర భూరీసర్వే చేయిస్తోందని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. గుర్ల, సదా నందపురం గ్రామాల్లో భూముల రీసర్వేపై మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు రీసర్వేతో శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. త్వరలో గ్రామాల్లో చేపట్టనున్న సర్వేకు సహకరించాలని రైతులను కోరారు. మండల సర్వేయర్ శివ, జూనియర్ అసిస్టెంట్ కల్యాణి పాల్గొన్నారు.

శతశాతం కచ్చితత్వంతో భూరీసర్వే



ధర్మవరంలో రీసర్వే పనులపై సిబ్బందిని ఆరాతీస్తున్న జేసీ మయూర్ అశోక్

శృంగవరపుకోట: సమగ్ర భూరీర్వేను రైతులకు ప్రయోజకరంగా ఉండేలా, శతశాతం కచ్చితత్వంతో చేపట్టాలని క్షేత్రస్థాయి సర్వే సిబ్బంది, మండల రెవెన్యూ అధికారులకు జేసీ మయూర్ అశోక్ దిశానిర్దేశం చేశారు. ధర్మవరం గ్రామంలో చేస్తున్న రీసర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. భూముల గుర్తింపు ఎలా చేస్తున్నారు, నిజానిజాలను, రికార్డులు, ఆధారాల పరిశీలన ఎలా చేస్తున్నారంటూ రెవెన్యూ ఉద్యోగులను ఆరా తీశారు. ప్రలోభాలకు లోబడి తప్పులు చేస్తే తగిన మూల్యం చెల్లిస్తారని, రైతాంగం యాజమాన్య హక్కులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, స్థానిక రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

అరటితోటల పరిశీలన

మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఇటీవల వర్షాలకు నేలకొరిగిన అరటి పంటలను జేసీ మయూర్‌అశోక్, జిల్లా ఉద్యానవన శాఖ జేడీ ఏ.వి.ఎస్.వి.జమదగ్ని, ఏడీ కె.శైలజ, ఎస్.కోట హెచ్‌ఓ అనిత తదితరులు పరిశీలించారు. మండలంలో మధుపాడ, సీతారాంపురం, గోపాలపల్లి, వేములాపల్లి గ్రామాల్లో పంట నష్టపోయినట్టు అధికారులు తెలిపారు.

సక్రమంగా సర్వే నిర్వహించాలి

చీపురుపల్లిరూరల్: సమగ్ర భూసర్వేను సక్రమంగా నిర్వహించాలని ఆర్డీఓ అప్పారావు రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలం లోని రావివలస గ్రామంలో మంగళవారం చేపట్టిన గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పనులను తహసీల్దార్ సురేష్‌తో కలిసి పరిశీలించారు. సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు.

వర్షానికి కూలిన సన్‌షేడ్

బొండపల్లి: అల్పపీడనద్రోణి ప్రభావంతో గత మూడు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం రెండున్నర గంటలపాటు కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షాలకు ముద్దూరు గ్రామంలో మునకాల రాములప్పమ్మకు చెందిన స్లాబు ఇళ్లు సన్‌షేడ్ పూర్తిగా కూలి పోయింది. అసమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



ఘనంగా నూకాలమ్మ పండగ



లక్కవరపుకోట:మల్లివీడులో నూకాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



ఎస్.కోటలో పూజలందుకుంటున్న నూకాంబిక అమ్మవారు

శృంగవరపుకోట/జామి/లక్కవరపుకోట/ కొత్తవలస/ వేపాడ: తెలుగు నూతన సంవత్సరం ఆరంభం తరుణంలో కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఏటా మాదిరిగా ఎస్.కోట,జామి, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలాల్లోని పలుగ్రామాల్లో నూకాలమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని నూకాలమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూలు,పండ్లు, పిండివంటలు నివేదించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దళిత ద్రోహి చంద్రబాబు

చీపురుపల్లి: దళితులను అణగదొక్కుతూ, దళితుల అభివృద్ధికి అడ్డుపడుతూ నిరంతరం అన్యాయం చేసిన దళిత ద్రోహిగా చరిత్రలో టీడీపీ అధ్యక్షుడు చంద్ర బాబునాయుడు మిగిలిపోతారని వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంఆర్‌పీఎస్ నాయకుడు కోరుకొండ దాలయ్యతో కలిసి దళిత నాయకులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం చూస్తుంటే దళితులపై టీడీపీ వైఖరి అర్థమవుతోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మొదటి నుంచి దళితులు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. దళిత కులాల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని ఆయన ప్రస్తావించడం చూశామన్నారు. ఇటీవల పాదయాత్రలో ఆయన కొడుకు నారా లోకేష్ దళితులపై చెప్పుకోలేని విధంగా దూషణలకు పాల్పడిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అమరావతిలో దళితులకు ఇళ్లు కట్టాలని నిర్ణయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లి అడ్డుకున్న చంద్రబాబునాయుడు నైజం దళితులు గుర్తు పెట్టుకుంటారన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న దళిత నాయకులు

2014లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబునాయుడు రాజ్యాంగ నిర్మాత బాబసాహేబ్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మిస్తామని హామీ ఇచ్చి పనులు చేపట్టకుండా దళితులను మోసం చేశారన్నారు. 2019లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ స్మృతివనం కోసం విజయవాడలో 50 ఎకరాలు కేటాయించడమే కాకుండా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని త్వరితగతిన నిర్మించి పనులు పూర్తి చేశారని, ఏప్రిల్ 14న ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. దళితులు అంటే చంద్రబాబుకు చులకనగా ఉందని అందుకనే అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడి చేయించారన్నారు. తక్షణమే టీడీపీ నాయకులు సుధాకర్ బాబుకు క్షమాపణ చెప్పాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఏకమై టీడీపీపై పోరాటానికి సిద్ధమవ్వక తప్పదని హెచ్చరించారు. దళిత నాయకులు అడ్డూరి రామకృష్ణ, రాము, కనకరాజు, సింహాచలం , రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయం - పురిటిపెంట
బహిరంగవేలం ప్రకటన

రోఖా నెం.23/2023 తే 20.03.2023ది

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామ పంచాయితీకి చెందిన ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ 1 ప్రకారం 2023-24 సంవత్సరమునకు రోజువారి మార్కెట్ ఆశీలు వేలం ద్వారా గుత్త కేటాయింపుకు తే.24.03.2023ది శుక్రవారం ఉదయం 10:00 గం॥ల నుండి 12గం॥వరకు టెండర్లు స్వీకరించి మధ్యాహ్నం 12గం॥లకు పురిటిపెంట గ్రామపంచాయితీ కార్యాలయములో శ్రీ విస్తరణ అధికారి (PR & RD) గజపతినగరం వారి సమక్షములో సర్పంచ్ శ్రీమతి శొంట్యాన విజయలక్ష్మి గారి అధ్యక్షతన బహిరంగ వేలం జరుపబడును. [illegible] రూ 1,00,000/-లు (అక్షరములా ఒక లక్ష రూపాయలు) [illegible] తెలుసుకోనగలరు.

1.టెండరు కమ్ వేలం పాట — షెడ్యూల్ -1

వ.నెం	వివరములు	సంవత్సరము	ధరావత్తు
1	రోజు వారి మార్కెట్ ఆశీలు వసూళ్లకు గుత్త హక్కునకు 2023-2024సం॥నకు (01.4.2023ది నుండి 31.3.2024ది వరకు, 12 నెలలు	2023-2024 (12నెలలు)	రూ॥ 25,000/-

శ్రీమతి శొంట్యాన విజయలక్ష్మి, సర్పంచ్, గ్రామపంచాయితీ - పురిటిపెంట

శ్రీ జి.జనార్ధనరావు, పంచాయితీ కార్యదర్శి, పురిటిపెంట